సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం । 6 । నవంబర్ । 2024



ముంచేస్తున్నది..
భద్రాచలం గోదావరి ఒడ్డున ఇటీవల వరుస విషాద ఘటనలు చోటుచేసుకుంటున్నా అధికారుల తీరు మారడం లేదు. 8లో



వ్యవసాయ అవసరాలకు విద్యుత్
వర్షాధారంగా పంటలు సాగుచేసే గిరిజన రైతుల పొలాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఐటీడీఏ పీఓ రాహుల్ అన్నారు. 8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
31° / 20°
జిల్లాలో బుధవారం ఉదయం ఎండ మొదలై మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రత నమోదవుతుంది. రాత్రి వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువు దీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అదేవిధంగా మంగళవారాన్ని పురస్కరించుకుని శ్రీ అభయాంజనేయస్వామి వారికి అభిషేకం, తమలపాకులతో అర్చన గావించారు.

కిన్నెరసానిని సందర్శించిన జడ్జి

పాల్వంచరూరల్: పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి జి.భానుమతి మంగళవారం సందర్శించారు.ఈ సందర్భంగా డీర్ పార్కులోని దుప్పులను వీక్షించడంతో పాటు జలాశయంలో బోటింగ్ చేశారు.

కొత్తగూడెంలో రేపు జాబ్‌మేళా

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈనెల 7న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కొండపల్లి శ్రీరామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేడ్చల్‌లోని కేఎల్ గ్రూప్స్‌లో 250 మంది నియామకం కోసం కంపెనీ బాధ్యులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. 18 నుంచి 35 ఏళ్ల వయసు కలిగి ఎస్సెస్సీ మొదలు డిగ్రీ ఉత్తీర్ణులైన వారు ఉదయం 10 గంటలకు మొదలయ్యే ఇంటర్వ్యూలకు సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

ప్రగతిశీల ఉద్యమాలను ఉధృతం చేద్దాం

అమరవీరుల సంస్మరణ సభలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి

ఇల్లెందు: దేశానికి పెను ప్రమాదంగా మారిన మతోన్మాదాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకిస్తూ ప్రజా సమస్యలపై ప్రగతిశీల ఉద్యమాలు ముమ్మరంగా చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య పిలుపునిచ్చారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యాన ఇల్లెందులో అమరవీరుల సంస్మరణ ర్యాలీ నిర్వహించగా జంపాల చంద్రశేఖర ప్రసాద్, నీలం రాంచంద్రయ్య కన్ను మూసిన చీకటిగండ్ల అడవుల్లో నివాళులర్పించారు. అనంతరం సాహితీ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో నర్సయ్య మాట్లాడుతూ భూమి, భుక్తి, విముక్తి కోసమే కాక ఆర్థిక అసమానతలు లేని సమాజ స్థాపనకు జరిగిన పోరాటంలో జీవితాలను త్యాగం చేసిన అమరుల బాటలో విద్యార్థులు పయనించాలని కోరారు. పీడీఎస్‌యూ రాష్ట్ర, జిల్లా ప్రధాన కార్యదర్శులు పెద్దింటి రామకృష్ణ, కాంపాటి పృథ్వీ మాట్లాడుతూ కార్పొరేట్ విద్యా విధానంతో పేదలు చదువుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బతుకులు మారేలా శాస్త్రీయ విద్యావిధానం అమలులోకి తీసుకురావాలని, స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఓయూ లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గుమ్మడి అనురాధతోపాటు నాయకులు ఆవుల అశోక్‌కుమార్, చంద్ర అరుణ, నాయిని రాజు, నర్సింహారావు, వాంకుడోతు అజయ్, బుర్ర వెంకన్న, లక్ష్మణ్, వెంకటేష్, నరేందర్, మునిగెల శివ, గణేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతు చిత్తు



సుజాతనగర్ కొనుగోలు కేంద్రంలో లోడ్ చేస్తున్న పత్తి

పత్తి రైతు మరోసారి మార్కెట్ ఊబిలో చిక్కుకుపోతున్నాడు. మద్దతు ధర క్వింటాకు రూ.7,521 ఉంటే రైతుల చేతికి మాత్రం రూ.5,200 రావడమే గగనంగా మారింది. పత్తి కొనుగోళ్లను సరళతరం చేయడంలో మార్కెటింగ్ శాఖ నిర్లక్ష్యం, వడ్డీ వ్యాపారులు, దళారుల ముందస్తు వ్యూహాల నడుమ రైతు కష్టానికి తగ్గ ప్రతిఫలం రావడం లేదు.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

క్వింటా పత్తికి రూ.7,521గా ప్రభుత్వ నిర్ణయం
- క్షేత్రస్థాయిలో రైతుకు దక్కని మద్దతు ధర
- తేమ శాతం, ఆధార్ పేరుతో సీసీఐ కొర్రీలు
- కల్లాల వద్దే కొనుగోలు చేస్తున్న ప్రైవేట్ వ్యాపారులు

జిల్లాలో భారీగా సాగు..
ఈ సీజన్‌లో జిల్లాలో 2.10 లక్షల ఎకరాల్లో పత్తి సాగయింది. దీంతో 1.60లక్షల మెట్రిక్ టన్నుల మేర దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు సుజాతనగర్, అశ్వాపురం, బూర్గంపాడు మండలాలతో పాటు ఇల్లెందు సమీపంలోని కారేపల్లిలో పత్తి కొనుగోలు కేంద్రాలను కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ప్రారంభించింది. ఈ సీజన్‌లో క్వింటా పత్తికి రూ.7,521 మద్దతు ధరగా ప్రభుత్వం ప్రకటించింది. అయితే క్షేత్రస్థాయిలో రైతులకు ఈ ధర రావడం లేదు. సీసీఐ కేంద్రాలకు రావడానికి ముందే వ్యాపారులు, దళారులు చేల వద్దకు, రైతుల ఇళ్లకు వెళ్లి పత్తి కొనుగోలు చేస్తున్నారు.

కేంద్రాల ఏర్పాటులో జాప్యంతో..
రెండు వారాల క్రితం నుంచే మార్కెట్‌కు పత్తి వస్తోంది. అయితే రెండు రోజుల కిందటే సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసింది. ఇక అంతకుముందే లైసెన్స్‌లు ఉన్న, లేని వ్యాపారులు, వారి తాలూకు దళారులు రైతులతో బేరసారాలు ప్రారంభించారు. పత్తి చేల వద్ద, ఇంటివద్ద తామే కొనుగోలు చేస్తామని, మార్కెట్‌కు వెళ్తే రవాణా ఖర్చులు, తేమ శాతం కొర్రీలు, ఆధార్ అథెంటిఫికేషన్ అంటూ నానా ఇబ్బందులు పడాల్సి వస్తుందని చెబుతున్నారు. ఆ కష్టాలేమీ లేకుండా కొనుగోలు చేస్తామని, వెంటనే డబ్బు చెల్లిస్తామని రైతులకు ఆఫర్ ఇస్తున్నారు. ఇందుకు ప్రతిగా ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర కంటే తక్కువ ధర నిర్ణయిస్తున్నారు.

వడ్డీ వ్యాపారుల దందా..
జిల్లాలో 90 శాతం ప్రాంతం ఏజెన్సీ పరిధిలోకి వస్తుంది. గిరిజన జనాభా ఎక్కువగా ఉండడంతో ఇక్కడ పెసా, 1/70 వంటి చట్టాలు అమల్లో ఉన్నాయి. ఏజెన్సీ పరిధిలోని గ్రామాల్లో వడ్డీ వ్యాపారం చేయొద్దనే ఆంక్షలూ ఉన్నాయి. అయినా ఇవేవీ అమలుకు నోచుకోవడం లేదు. ఓ వైపు వడ్డీ వ్యాపారులు, మరోవైపు విత్తనాలు, పురుగు మందుల డీలర్లలో కొందరు ముందుగానే రైతులకు సాయం రూపంలో పెట్టుబడులు అందిస్తున్నారు. ఆ తర్వాత వచ్చిన పంటను సీసీఐ, వ్యవసాయ మార్కెట్ కమిటీ కొనుగోలు కేంద్రాలకు వెళ్లకుండా తమకే అమ్మాలంటూ షరతులు విధిస్తున్నారు. దీంతో సదరు వ్యాపారులు నిర్ణయించిన ధరకే అమ్ముకుంటూ రైతులు శ్రమ దోపిడీకి గురవుతున్నారు.

జాడ లేని 'మద్దతు'..
సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడంలో ఆలస్యంతో పాటు తేమ శాతం 8 నుంచి 12 మధ్య ఉంటేనే కొంటామని నిర్వాహకులు చెబుతుండడంతో రైతులు ఎక్కువగా ప్రైవేటు వ్యాపారులకే అమ్ముతున్నారు. తేమ శాతం ఎక్కువగా ఉన్నా క్వింటా పత్తికి రూ.6.900 వరకు ధర ఇవ్వాలని మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన సూచన సైతం అమలుకు నోచుకోవడం లేదు. ఉదాహరణకు పత్తి అమ్మకాలు అధికంగా జరిగే జూలూరుపాడు కొనుగోలు కేంద్రంలో మంగళవారం జెండా పాట (ఆరోజు వచ్చిన పత్తి నాణ్యత ఆధారంగా ఇచ్చే అధిక రేటు) రూ.6,800గానే ఉంది. కనిష్టంగా ఇది రూ.5,200 దగ్గర ఉంది. మార్కెట్‌కు వచ్చిన పత్తిలో పదో వంతుకు కూడా గరిష్ఠ ధర దక్కడం లేదు. మార్కెట్‌లో సగటు ధర రూ. 6,300 దగ్గర ఉంటే అదే రైతుల పొలాలు, ఇంటి దగ్గర సగటు ధర రూ.5,200 వద్ద మొదలై రూ.5,500 దాటడం లేదు. మొత్తంగా సీసీఐ, వ్యవసాయ మార్కెట్ సిబ్బంది కొర్రీలు, వడ్డీ వ్యాపారుల అత్యాశ మధ్య చిక్కుకుని పత్తి రైతు చిత్తవుతున్నాడు. కష్టపడి పండించిన పంటకు సరైన ధర రాకుండానే అమ్ముకోవాల్సి వస్తోంది.

పాల్వంచ మండలం లక్ష్మీదేవిపల్లి శివాలయం వద్ద పుట్టలో పాలు పోస్తున్న భక్తులు





నాగరాజా.. రక్షించు

నాగుల చవితి వేడుకలను జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పుట్టల్లో పాలు పోస్తూ, నాగ ప్రతిమలు వేస్తూ నాగరాజా.. రక్షించు అంటూ వేడుకున్నారు. నాగేంద్రస్వామికి నైవేద్యంగా కొబ్బరికాయలు, పండ్లు సమర్పించారు. భక్తుల రాకతో పలు ఆలయాలు, పుట్టల ప్రదేశాల వద్ద సందడి నెలకొంది. కాగా, ఆలయాలు, పుట్టల వద్ద పలువురు తమ చిన్నారులకు చెవులు కుట్టించారు.

9లో

గుంపెన సొసైటీకి ఉత్తమ పురస్కారం

అన్నపురెడ్డిపల్లి (చండ్రుగొండ) : మండలంలోని గుంపెన గ్రామంలో గల సహకార పరపతి సంఘానికి ఉమ్మడి జిల్లాలోనే ఉత్తమ అవార్డు దక్కింది. రుణాల రికవరీతోపాటు రైతులకు తిరిగి కొత్త రుణాల పంపిణీ, వ్యాపారం తదితర అంశాల్లో ఈ సొసైటీ ఉమ్మడి జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతో ఖమ్మంలో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో డీసీసీబీ సీఈఓ వసంతరావు చేతుల మీదుగా ఉత్తమ అవార్డును చైర్మన్ బోయినపల్లి సుధాకర్‌రావు అందుకున్నారు.



అవార్డు అందుకుంటున్న సుధాకర్‌రావు

ఆర్మీ జవాన్‌కు కన్నీటి వీడ్కోలు

ఘనంగా నివాళులర్పించిన పోలీసులు, ఆర్మీ అధికారులు

భద్రాచలంఅర్బన్: దేశ రక్షణ రంగంలో అస్సాం రాష్ట్రం సోనిత్‌పూర్ జిల్లా రంగాపారాలో విధులు నిర్వర్తిస్తూ ఆదివారం ఏనుగుల దాడిలో మృతిచెందిన వీర జవాన్ కొంగా సాయిచంద్రారావు అంత్యక్రియలు మంగళవారం భద్రాచలంలో జరిగాయి. కుటుంబసభ్యులు, పట్టణ పోలీసులు, ఆర్మీ అధికారులు, ప్రజలు అశ్రునయనాలతో వీడ్కోలు పలికారు. పట్టణంలోని అశోక్‌నగర్ కొత్తకాలనీకి చెందిన కొంగా సాయిచంద్రారావు అస్సాం సోనిత్‌పూర్ జిల్లా రంగాపారా ప్రాంతంలోని ఠాకూర్బారీ ఆర్మీ యూనిట్లో నాయబ్ సుబేదార్‌గా విధులు నిర్వర్తిస్తూ ఏనుగుల దాడిలో మృతిచెందిన విషయం విదితమే. మంగళవారం తెల్లవారు జామున 4:30 గంటలకు మృతదేహాన్ని భద్రాచలానికి తీసుకురాగా, మధ్యాహ్నం అంతిమయాత్ర నిర్వహించారు. మృతదేహాన్ని స్థానిక సీఎస్ఐ చర్చిలో కాసేపు ప్రార్థనలు చేశారు. ఆ తర్వాత మూడున్నర కిలోమీటర్లు అంతిమయాత్రగా శ్మశాన వాటికకు చేరుకున్నారు. చంద్రారావు భౌతిక కాయం వద్ద ఆర్మీ అధికారులు జాతీయ పతాకం ఉంచి, భారత్‌మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. చంద్రారావు చివరిసారిగా ధరించిన యూనిఫాంతో పాటు జాతీయ పతాకాన్ని భార్య



భౌతికకాయం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు, బంధువులు

స్రవంతికి ఆర్మీ అధికారులు అందజేశారు. కార్యక్రమంలో అస్సాం ఆర్మీ నాయబ్ సుబేదార్ రెహమాన్, ఖమ్మం 11 ఎన్‌సీసీ బెటాలియన్ కల్నల్ ఎస్కే భద్రా, నాయబ్ సుబేదార్ ధనంజయ్, టౌన్ సీఐ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెలలో ఉద్యోగ విరమణ..
సాయిచంద్రారావు 23 ఏళ్ల క్రితం ఆర్మీలో చేరగా, ఈ ఏడాది డిసెంబర్‌లో ఉద్యోగ విరమణ చేయాల్సి ఉంది. రిటైర్డ్ అయ్యాక కుటుంబ సమస్యలు తీరుస్తానని చెప్పాడని, అంతలోనే నూరేళ్లు నిండాయని తల్లి దేవి, భార్య స్రవంతి విలపిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది. వచ్చే నెలలో ఉద్యోగ విరమణ చేసి, సంతోషంగా ఇంటికి రావాల్సిన వ్యక్తి.. ఇలా విగతజీవిగా రావడాన్ని కుటుంబసభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు.

'ప్రసాద్' పనుల పరిశీలన

దుమ్ముగూడెం : ప్రముఖ పుణ్య క్షేత్రమైన పర్ణశాలలో ప్రసాద్ పథకంలో చేపట్టిన పనులను టూరిజం శాఖ ఎస్ఈ సరిత మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పర్ణశాల నార చీరల వద్ద నిర్మించే బయో టాయిలెట్ల ప్రాంతాన్ని, ఐరన్ ఫుట్ బ్రిడ్జిని చూసి, అవసరమైన డిజైన్ ఇవ్వాలని సూచించారు. అనంతరం మాట్లాడుతూ.. నిర్మాణ పనులు నాణ్యతగా చేపట్టాలని, త్వరితిగతిన పూర్తయ్యేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో డీఈ రామకృష్ణ, ఏఈ ప్రసాద్ పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది రానివ్వొద్దు

- ధాన్యం కొనుగోళ్లపై జిల్లా ప్రత్యేకాధికారి సమీక్ష
- పెనగడపలో కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన సురేంద్రమోహన్



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్, పక్కన కలెక్టర్ జితేష్ వి పాటిల్ తదితరులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): వానాకాలం ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్ అధికారులను ఆదేశించారు. ఐడీఓసీలో మంగళవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో కలిసి కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జ్‌లు, ఆయా శాఖల అధికారులు, రైస్ మిల్లర్లతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. వానాకాలం పండించిన ధాన్యం చివరి గింజవరకూ నాణ్యత ఆధారంగా మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, 48గంటల్లో రైతులకు డబ్బులు చెల్లించాలని సూచించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలుకు తీసుకుంటున్న చర్యలపై కేంద్రాల ఇన్‌చార్జ్‌లను, వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. తేమ పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దని చెప్పారు. ధాన్యంలో నాణ్యత పాటించేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కొనుగోలు ప్రక్రియలో నిర్లక్ష్యం చేస్తే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో 2.95 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందనే అంచనాతో 165 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఏ గ్రేడ్ ధాన్యం రూ.2,320, బీ గ్రేడ్‌కు రూ.2,300 మద్దతు ధరగా ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఎలాంటి ఒత్తిడి వచ్చినా నాణ్యత లేని ధాన్యం కొనుగోలు చేయొద్దని స్పష్టం చేశారు. కొనుగోళ్ల వివరాలను ప్రతిరోజూ ఓపీఎంఎస్‌లో ఎంట్రీ చేయాలని, కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. రైస్ మిల్లుల్లో తాలు కట్ చేయడానికి వీల్లేదని, కొనుగోలు కేంద్రాల వద్దే నాణ్యతను పరిశీలించి పంపాలని చెప్పారు. అనంతరం ధాన్యం మద్దతు ధరకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

కొనుగోలు కేంద్రం తనిఖీ..
చుంచుపల్లి: కొత్తగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో పెనగడపలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ.. సన్నరకం ధాన్యం క్వింటాకు రూ.500 చొప్పున రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ఇస్తోందని, అది పొందాలంటే తప్పకుండా నిబంధనలు పాటించాలని చెప్పారు. కలెక్టర్ పాటిల్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, డీఏఓ బాబూరావు, డీఎస్‌ఓ రుక్మిణి, డీసీఓ సయ్యద్ ఖుర్షీద్, సివిల్ డీఎం త్రినాథ్‌బాబు, డీఎంఓ నరేందర్, కొత్తగూడెం పీఏసీఎస్ చైర్మన్ మండె వీరహనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

మట్టి ఇటుకలతో పర్యావరణ హితం

కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీఓ రాహుల్

భద్రాచలం: మట్టి ఇటుకలతో తక్కువ ఖర్చుతో ఇంటి నిర్మాణం చేపట్టవచ్చని, పర్యావరణానికి కూడా మేలు కలుగుతుందని కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీఓ బి. రాహుల్ అన్నారు. ఐటీడీఏలోని వైటీసీలో రమ్మిడి ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆదివాసీ గిరిజనుల ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలు భిన్నంగా ఉంటాయని అన్నారు. మట్టి ఇటుకల ఇళ్లతో పర్యావరణానికి హాని కలగదని, అనారోగ్యాలు దరి చేరవని, వేసవిలో చల్లగా ఉంటాయని తెలిపారు. చెరువులు, వాగుల్లో లభించే సహజసిద్ధమైన మట్టితో ఇటుకలు తయారు చేయాలని సూచించారు. వెదురుకర్రలతో అందమైన ఇళ్లు నిర్మించుకోవచ్చని, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలో ఎక్కువగా ఇలాంటి ఇళ్లే ఉంటాయని వివరించారు. పీఓ రాహుల్ మాట్లాడుతూ.. తక్కువ పెట్టుబడితో పాఠశాలల ప్రహరీలు, కిచెన్ షెడ్లు, డైనింగ్ హాళ్లు, అంగన్‌వాడీ సెంటర్లు, జీపీఎస్ పాఠశాలల నిర్మాణాలకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. అనంతరం నిర్వాహకులు తయారుచేసిన ఇటుకలను కలెక్టర్, పీఓ పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ విద్యాచందన, ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, జేడీఎం హరికృష్ణ, శిక్షకుడు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



మట్టి ఇటుకల తయారీని పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

సమాజానికి ఉపయోగపడే ప్రాజెక్టులు రూపొందించాలి..
కొత్తగూడెంఅర్బన్: ఈనెల 18, 19, 20 తేదీల్లో అన్నపురెడ్డిపల్లిలో జరిగే వైజ్ఞానిక ప్రదర్శనల్లో సమాజానికి, రైతులకు ఉపయోగపడే ప్రాజెక్టులు రూపొందించేలా విద్యార్థులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ పాటిల్ ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లాలోని సైన్స్ ఉపాధ్యాయులకు కొత్తగూడెంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైజ్ఞానిక ప్రదర్శనలు అలంకరణ కోసం కాకుండా విద్యార్థులు గుణాత్మకమైన శాస్త్రవేత్తలుగా తయారయ్యేలా ప్రోత్సహించాలని సూచించారు. జిల్లాలో ప్రత్యేకంగా చేపట్టిన మునగ సాగు, వర్షపునీరు నిల్వ చేసే గుంతల తయారీ, సంప్రదాయ నిర్మాణ పద్ధతులను విద్యార్థులకు వివరించాలని చెప్పారు. కార్యక్రమంలో డీఈఓ ఎం.వెంకటేశ్వరా చారి, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎ.నాగరాజ శేఖర్, జిల్లా సైన్స్ అధికారి ఎస్.చలపతిరాజు, రిసోర్స్ పర్సన్లు సంపత్ కుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మరోసారి అందరూ రండి..

- డీఎస్సీ–2008 అభ్యర్థుల సర్టిఫికెట్ల పునఃపరిశీలన
- నేడు, రేపు ఖమ్మం డైట్‌కు హాజరుకావాలని సూచన
- అక్రమాలు జరిగాయనే సందేహాలతో నిర్ణయం?

ఖమ్మం సహకారనగర్: డీఎస్సీ–2008లో అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్లను ఇటీవల పరిశీలించిన అధికారులు పునఃపరిశీలనకు నిర్ణయించారు. అప్పట్లో క్వాలిఫై అయిన అభ్యర్థులను 1:3 నిష్పత్తిలో పిలిచి ఉమ్మడి జిల్లాలోని మైదాన, ఏజెన్సీ ప్రాంత అభ్యర్థులు 343 మందికి కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగావకాశం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా సెప్టెంబర్ 30వ తేదీన ఖమ్మం పాత డీఈఓ కార్యాలయంలో సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టగా మైదాన ప్రాంత అభ్యర్థులు 128మందిలో 67మంది, ఏజెన్సీ అభ్యర్థులు 215మందికి 18మంది హాజరయ్యారు. అయితే, మరోమారు అందరి సర్టిఫికెట్లను బుధ, గురు వారాల్లో ఖమ్మం టేకులపల్లిలోని డైట్ కళాశాలలో పరిశీలిస్తామని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్స్‌తో హాజరుకావాలని సూచించారు.

మళ్లీ ఎందుకు?
డీఎస్సీ–2024 అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన సందర్భంగా అక్రమాలు జరిగాయని అధికారులకు ఫిర్యాదులు అందినట్లు తెలిసింది. దీంతో 2008 డీఎస్సీ అభ్యర్థుల కౌన్సెలింగ్‌లోనూ పొరపాట్లు జరిగి ఉంటాయనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఏళ్లు గడిచిపోవడంతో అక్రమాలు జరిగి ఉండొచ్చనే సందేహానికి తోడు తక్కువ మందే హాజరుకావడంతో రెండోసారి పరిశీలనకు నిర్ణయించినట్లు తెలిసింది. ఈసారి విద్యాశాఖతో పాటు గిరిజన సంక్షేమ శాఖ అధికారులు కూడా పాల్గొని ఏజెన్సీ అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలిస్తారని సమాచారం. కాగా, విద్యాశాఖపై ప్రత్యేక దృష్టి సారించిన ఖమ్మం కలెక్టర్.. ఇటీవల వచ్చిన ఆరోపణల నేపథ్యాన ఈ నిర్ణయం తీసుకున్నారనే ప్రచారం కూడా జరుగుతోంది.

క్లుప్తంగా

కేటీపీఎస్ సొసైటీ స్పెషల్ ఆఫీసర్‌గా ఆదినారాయణ

ప్రస్తుతం ఉన్న కమిటీ రద్దు

సాక్షి ఎఫెక్ట్..

పాల్వంచ: కేటీపీఎస్ కోఆపరేటివ్ సొసైటీ స్పెషల్ ఆఫీసర్‌గా జిల్లా సహకార శాఖ సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణ మంగళవారం నియమితులయ్యారు. సొసైటీ ప్రస్తుత పాలక వర్గ పదవీ కాలం ఈ నెల 4వ తేదీన ముగియడంతో కొత్తగా పాలక వర్గ ఏర్పాటుపై జిల్లా సహకార సంఘం అధికారులు దృష్టి సారించకుండా నిర్లక్ష్యం చేయడంతో మంగళవారం 'ముగిసిన కేటీపీఎస్ సొసైటీ పదవీకాలం'అనే శీర్షిక 'సాక్షి'కథనం ప్రచురించింది. దీంతో అధికారులు స్పందించారు. ప్రస్తుతం ఉన్న కమిటీని రద్దు చేశారు. బుధవారం నుంచి సొసైటీ లావాదేవీలకు సంబంధించి పూర్తి బాధ్యతను ఆదినారాయణ నిర్వహించనుండగా.. వచ్చే 15 రోజుల్లో ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు.

ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే జరపాలి



రికార్డులు అందిస్తున్న సుకృత

పాల్వంచరూరల్: వందశాతం కాన్పులు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే జరపాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జి.సుకృత అన్నారు. మండలంలోని ఉల్వనూరు పీహెచ్‌సీని మంగళవారం ఆమె సందర్శించి, రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడారు. మాతా శిశు సంరక్షణ, నవజాత శిశు సంరక్షణపై అవగాహన కల్పించారు. ఆశా కార్యకర్తలకు నూతన రికార్డులను పంపిణీ చేశారు.

8 నుంచి రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీలు

కల్లూరు: కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీలకు ఏర్పాట్లు చేశామని నిర్వహణ కార్యదర్శి పి.వీరరాఘవయ్య తెలిపారు. అండర్-17 బాలికల విభాగంలో ఈనెల 8నుంచి 10వ తేదీ వరకు పోటీలు జరుగుతాయని వెల్లడించారు. ఈ మేరకు ఖో-ఖో అసోసియేషన్ల బాధ్యులు చొరవ తీసుకుని క్రీడాకారులు హాజరయ్యేలా చూడాలని కోరారు. వివరాలకు 9440669401 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

మందుపాతరను నిర్వీర్యం చేసిన బలగాలు



కోబ్రా బలగాలు గుర్తించిన మందుపాతర

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో పోలీసు బలగాలే లక్ష్యంగా మావోయిస్టులు ఏర్పా టు చేసిన శక్తివంతమైన మందుపాతరను గుర్తించిన కోబ్రా బలగాలు నిర్వీర్యం చేశాయి. బీజాపూర్ జిల్లా సాన్నార్-కొర్చేలీ మార్గంలో కోబ్రా 202 బెటాలియన్ ఆధ్వర్యాన మంగళవారం కూంబింగ్ చేపట్టారు. ఈ క్రమాన రహదారి వెంట తనిఖీలు నిర్వహిస్తుండగా సుమారు 5 కిలోల సామర్థ్యం కలిగిన మందుపాతరను గుర్తించారు. బాంబు డిస్పోజల్ స్క్వాడ్ ఆధ్వర్యాన మందుపాతరను వెలికితీసి నిర్వీర్యం చేయడంతో బలగాలకు ముప్పు తప్పినట్లయింది.

ఇన్‌ఫార్మర్ నెపంతో గ్రామస్తుడి హత్య

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లాలో ఇన్‌ఫార్మర్ పేరిట మావోయిస్టులు ఓ వ్యక్తిని హతమార్చారు. సుక్మా జిల్లా గదిరాస్ పోలీస్ స్టేషన్ పరిధి గొండెరాస్ గ్రామానికి చెందిన నెమిడి పరాగను బుధవారం వారు హత్య చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించారు. అయితే, ఘటనపై అధికారికంగా ప్రకటన విడుదల చేయలేదు.


నిల్వ ఉంచిన టేకు కలప స్వాధీనం



అధికారులు స్వాధీనం చేసుకున్న కలప

చర్ల: మండలంలోని ఆర్.కొత్తగూడెం, సత్యనారాయణపురం, కొత్తపల్లి గ్రామాల్లో నిల్వ ఉంచిన టేకు కలపను మంగళవారం చర్ల అటవీ రేంజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. చర్ల ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ద్వాలియా నేతృత్వంలో రేంజ్ సిబ్బంది ఆర్.కొత్తగూడెం, సత్యనారాయణపురం, కొత్తపల్లి గ్రామాల్లో కార్పెంటర్లు టేకు కలప నిల్వ ఉంచారన్న సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించారు. టేకు దిమ్మెలతో పాటు సైజులుగా కోసిన ముక్కలు లభ్యమవడంతో వాటిని స్వాధీనం చేసుకొని చర్ల రేంజ్ కార్యాలయానికి తరలించారు. స్వాధీనం చేసుకున్న కలప సుమారు రూ.1.20 లక్షల విలువ ఉంటుందని రేంజ్ అధికారి ద్వాలియా తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.19,144

ముంచేస్తున్నది..



గోదావరిలో గల్లంతైన వ్యక్తి కోసం గాలిస్తున్న పోలీసులు (ఫైల్)

- భద్రాచలం వద్ద గోదావరిలో మునిగి ప్రాణాలు కోల్పోతున్న భక్తులు
- ఈ ఏడాది ఇప్పటివరకు పది మందికి పైగానే మృతి
- స్నానఘట్టాల వద్ద రక్షణ చర్యలు లేకపోవడమే కారణమంటున్న భక్తులు
- వరుస ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు

భద్రాచలంఅర్బన్: దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం గోదావరి ఒడ్డున ఇటీవలి కాలంలో వరుస విషాద ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. దైవ దర్శనానికి వస్తున్న భక్తులు గోదావరిలో స్నానం చేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటమునిగి చనిపోతున్నారు. నదిలో లోతును అంచనా వేయలేక స్నానానికి వెళ్లిన భక్తులు మృత్యువాత పడుతున్నా అధికారుల తీరు మారడం లేదు. ముందస్తు చర్యలు చేపట్టాల్సిన రామాలయం, ఇరిగేషన్, పోలీస్, రాష్ట్ర విపత్తు శాఖ అధికారుల నిర్లక్ష్యంతో వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రమాదాలు జరిగిన తర్వాత హడావుడి చేయడం కాకుండా.. వాటి నివారణకు ముందుగానే ఎందుకు ప్రణాళికలు రూపొందించడం లేదని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది పది మందికి పైగానే ప్రమాదవశాత్తు గోదావరిలో మునిగి మృతి చెందారు.

ఏడాది పొడవునా రద్దీ

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తోపాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి సైతం ఏడాది పొడవునా భక్తులు తరలి వస్తారు. సెలవు రోజులతో పాటు ముఖ్యంగా వేసవి సెలవుల్లో వేలాది మంది భక్తులు రాముల వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేందుకు కుటుంబ సమేతంగా వస్తారు. వీరిలో పుణ్యస్నానాలు ఆచరించే క్రమాన ఏటా పదుల సంఖ్యలో భక్తులు చనిపోతున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఆలయానికి ఏటా కోట్ల రూపాయలు ఆదాయం సమకూరుతున్నా భక్తులు ప్రమాదాల బారిన పడకుండా స్నానాలు చేసేందుకు వీలుగా కనీస సౌకర్యాలు కల్పించకపోవడం మరణాలకు కారణమవుతోంది.

సమన్వయం లేక..

రామాలయం, ఇరిగేషన్, పోలీస్, రాష్ట్ర విపత్తు శాఖ అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తే నీటి ప్రమాదాలను నివారించవచ్చు. కానీ, 2022లో భద్రాచలంలో వచ్చిన వరదల సమయంలో విధులు నిర్వహించిన గత ఈతగాళ్లకు చెల్లింపులు చేయకపోవడంతో వారు ఇటు వైపు రావడం లేదు. ఇకనైనా గోదావరి లోతుకు ఎవరూ వెళ్లకుండా గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచడమే కాక విపత్తు శాఖ నుంచి మరబోటు, రక్షణ సామగ్రి, సిబ్బందిని శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే, పోలీసు శాఖ ఆధ్వర్యంలో గోదావరి ఒడ్డున కరకట్ట ప్రాంతంలో గస్తీ పెంచి మైక్ ద్వారా హెచ్చరికలు జారీ చేస్తుండాలని కోరుతున్నారు.

గోదావరిలో మునిగి మృతి చెందిన వారి వివరాలు

ఏడాది	మృతుల సంఖ్య
2014	06
2015	07
2016	05
2017	05
2018	04
2019	04
2020	05
2021	08
2022	12
2023, 2024	10
(ఇప్పటివరకు)	

భక్తులను రక్షించిన ఫొటోగ్రాఫర్లు..

గోదావరిలో స్నానాన్ని ఆచరించేందుకు వెళ్లి ఇటీవల పలువురు లోతు అంచనా వేయలేక గల్లంతయ్యారు. అక్కడే ఫొటోలు తీస్తూ జీవనం సాగించే ఫొటోగ్రాఫర్లు కొందరిని కాపడారు. గతనెల 19వ తేదీన ఇల్లెందుకు చెందిన ఓ వృద్ధురాలితో పాటు ముగ్గురు చిన్నారులు గల్లంతవుతుండగా ఫొటోగ్రాఫర్ కాపాడాడు. గతనెల 20న గోదావరిలో స్నానం చేస్తున్న ఇద్దరు యువకులు, 21న భద్రాచలానికి చెందిన ఓ వ్యక్తి, అదే రోజు మనస్తాపంతో గోదావరిలో ఆత్మహత్య చేసుకోవాలనుకున్న వృద్ధురాలు, ఈ నెల 2వ తేదీన కార్తీక మాసం సందర్భంగా పుణ్యస్నానాలకు వచ్చి గల్లంతవుతున్న ఇద్దరిని ఫొటోగ్రాఫర్, గత ఈతగాడైన కరకు ప్రసాద్ కాపాడాడు.

కలెక్టర్ ఆదేశాలతో ఐరన్ మెష్ ఏర్పాటు



కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ ఆదేశాల మేరకు భద్రాచలం గోదావరిలో స్నానం చేసే భక్తుల రక్షణ కోసం ఐరన్ మెష్‌ను ఏర్పాటు చేశాం. గోదావరిలో పుణ్యస్నానం చేసే భక్తులు ఐరన్ మెష్‌ను దాటి నదిలోకి వెళ్లొద్దు. గత ఈతగాళ్లను అందుబాటులో ఉంచే విషయంపై చర్చిస్తాం. భక్తుల రక్షణకు సంబంధిత శాఖ అధికారులతో చర్చలు జరిపి తగు చర్యలు తీసుకుంటాం.

–దామోదర్‌రావు, ఆర్డీఓ, భద్రాచలం

అధికారులు బాధ్యత తీసుకోవాలి



గోదావరిలో స్నానం చేసేందుకు వెళ్లి నీటి లోతును అంచనా వేయలేక ఇటీవల భక్తులు ప్రమాదానికి గురయ్యారు. సంబంధిత శాఖ అధికారులతో పాటు దేవస్థానం అధికారులు సమన్వయం చేసుకుని భక్తుల ప్రాణాలకు రక్షణ కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలి. నిత్యం గోదావరి తీరంలో పర్యవేక్షణ ఉండేలా అధికారులు చర్యలు తీసుకుని భక్తులకు మనోధైర్యాన్ని ఇవ్వాలి.

–మానే రామకృష్ణ, బీఆర్ఎస్ నాయకుడు, భద్రాచలం

గిరిజనుల వ్యవసాయ అవసరాలకు విద్యుత్

ఐటీడీఏ పీఓ రాహుల్



క్రీడాకారులను అభినందిస్తున్న పీఓ రాహుల్

భద్రాచలం: వర్షాధారంపై ఆధారపడిన పంటలు సాగు చేసే గిరిజన రైతుల పొలాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం ఆయన అటవీ, విద్యుత్ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. గిరిజన గ్రామాల్లో పోడు పట్టా కలిగిన రైతులకు విద్యుత్ సౌకర్యం కల్పించే అంశంపై సమీక్షిస్తూ దరఖాస్తుల ఆధారంగా విద్యుత్, అటవీ శాఖ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించాలని తెలిపారు. అలాగే, గిరిజన రైతులకు మోటార్ పంప్‌లు ఇచ్చేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకొస్తున్నందున విద్యుత్ లైన్లు వేయాలని సూచించారు. విద్యుత్ కనెక్షన్ ఇచ్చాక అటవీ జంతువులు, అడవులకు నష్టం కలిగించకుండా అవగాహన కల్పించాలని, అలాంటి చర్యలకు పాల్పడితే పోడు పట్టాలు రద్దవుతాయనే అంశాన్ని వివరించాలని తెలిపారు. అలాగే, గిరిజన గ్రామాల్లో పర్యాటకంగా అభివృద్ధికి ప్రణాళికలను సిద్ధం చేయాలని పీఓ సూచించారు.

సరైన శిక్షణ ఇస్తే...

గిరిజన విద్యార్థులకు సరైన శిక్షణ ఇప్పిస్తే అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తారని పీఓ బి.రాహుల్ తెలిపారు. లాంగ్‌జంప్, షాట్‌పుట్‌లో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన మడకం శ్రీవిద్య దొర, అఫ్రీన్‌ను మంగళవారం ఆయన అభినందించారు. ఒడిశాలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఏపీఓ జనరల్‌డేవిడ్ రాజ్, వివిధ శాఖల అధికారులు ఆర్.లక్ష్మీనారాయణ, మునీర్‌పాషా, గిరిప్రసాద్, పునేం కృష్ణ, ముర్ల రమేష్‌రెడ్డి, పాయం రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

పుట్టలు లేవు.. లోపలికి రావొద్దు

భక్తులను అడ్డుకున్న ఎఫ్‌డీఓ సుజాత



భక్తులను బయటకు వెళ్లాలని సూచిస్తున్న ఎఫ్‌డీఓ సుజాత

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని అటవీ శాఖ డివిజన్ కార్యాలయ ఆవరణలో ఉన్న పుట్టల వద్ద ఏటా నాగులచవితి సందర్భంగా భక్తులు పాలుపోసి పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. మంగళవారం కూడా వివిధ కాలనీల నుంచి భక్తులు రావడంతో ఎఫ్‌డీఓ సుజాత అడ్డుకుని ఇక్కడ పుట్టలు లేనందున ఎవరూ లోపలికి రావొద్దని సూచించారు. కార్యాలయ ఆవరణలోకి వచ్చిన వారిని బయటకు పంపించి గేట్‌కు తాళం వేయించడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు 30ఏళ్లుగా ప్రతీ నాగులచవితికి ఇక్కడ పుట్టల్లోనే పాలు పోసి నాగేంద్రుడికి పూజలు చేస్తున్నామని, ఇప్పుడు అడ్డుకుని తమ మనోభావాలు దెబ్బతీయడం సరికాదని పేర్కొనడంతో వాగ్వాదం జరిగింది. కాగా, కార్యాలయంలో పుట్టలు లేవని, భక్తులు దీపాలు వెలిగిస్తే ఎండిన చెత్తకు నిప్పంటుకుని ప్రమాదం జరిగే అవకాశమున్నందున అనుమతించలేదని ఎఫ్‌డీఓ సుజాత తెలిపారు. సుమారు రెండు గంటల పాటు భక్తులు అక్కడే ఉండి లోపలకు అనుమతించాలని కోరినా ఎఫ్‌డీఓ ససేమిరా అనడంతో అంతా వెనుదిరిగారు.

తప్పిపోయిన వ్యక్తి ఆచూకీ లభ్యం



జగదీశ్‌ను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఎస్‌ఐ

ములకలపల్లి: అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ లభించడంతో పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎస్‌ఐ రాజశేఖర్ కథనం మేరకు.. మండలంలోని జగన్నాథపురానికి చెందిన కందిమళ్ల జగదీశ్ లారీక్లీనర్‌గా పనిచేస్తున్నాడు. జూలై 9న విధులకు వెళ్లిన జగదీశ్ తిరిగి ఇంటికి రాలేదు. గత నెల 17వ తేదీన జగదీశ్ భార్య రాజేశ్వరి పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు జగదీశ్ ఉత్తర్‌ప్రదేశ్‌లో ఉన్నట్లు గుర్తించారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

డబ్బు వసూలు చేస్తున్నారని వైద్యశిబిరం అడ్డగింత

తల్లాడ: వైద్యపరీక్షలు నిర్వహించి మందులు తమ వద్దే కొనుగోలు చేయాలని డబ్బు వసూలు చేస్తున్నారంటూ ఆరోగ్య హెల్త్ చారిటబుల్ ట్రస్ట్ సిబ్బందిని బీజేపీ నాయకులు అడ్డుకోవడమే కాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని మంగాపురంలో ట్రస్ ఆధ్వర్యాన ఫుల్ బాడీ స్కానింగ్ చేస్తామని మంగళవారం క్యాంప్ ఏర్పాటుచేశారు. ఈక్రమంలో రూ.270 చొప్పున వసూలు చేస్తూ, వ్యాధులు తగ్గించేందుకు మందులు కొనాలని సూచించినట్లు తెలిసింది. దీంతో బీజేపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఆపతి వెంకటరామారావు, గాదె కృష్ణారావు అడ్డుకోగా తాము పరీక్షలు ఉచితంగా చేసి మందులకు మాత్రమే డబ్బు తీసుకుంటున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు ట్రస్ట్ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తల్లాడ పోలీసులతో పాటు పీహెచ్‌సీలో ఫిర్యాదు చేశారు. కాగా, మండల వైద్యాధికారి రత్న మనోహర్ మాట్లాడుతూ గ్రామాల్లో అనధికారికంగా వైద్యపరీక్షలు చేసే వారి విషయంలో అప్రమత్తంగా ఉంటూ తమకు కానీ పోలీసులు లేదా ఎంపీడీఓ, తహసీల్దార్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

లంచం అడిగిన గ్రామ కార్యదర్శి అరెస్ట్



కార్యదర్శి పుల్లయ్య

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్లలో ఓ వ్యక్తి ఇంటికి విద్యుత్ మీటర్ కోసం నో ఆబ్జక్షన్ సర్టిఫికెట్ కావాలని కోరితే.. రూ.20 వేలు లంచం అడిగిన గ్రామ కార్యదర్శిని ఏసీబీ అధికారులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఏసీబీ డీఎస్పీ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఒకరు ఇంట్లో విద్యుత్ మీటర్ ఏర్పాటుకు ఎన్‌ఓసీ కోసం గ్రామ కార్యదర్శి కాంపాటి పుల్లయ్యను సంప్రదించాడు. ఎన్‌ఓసీ కావాలంటే రూ.20 వేలు లంచం ఇవ్వాలని పుల్లయ్య అడగగా, అంత డబ్బు తన వద్ద లేవని బతిమాలినా సెక్రటరీ ఒప్పుకోలేదు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా డీఎస్పీ వై.రమేష్ సిబ్బందితో వచ్చి పుల్లయ్యను అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రభుత్వ శాఖల్లో పనిచేసే వారు లంచం తీసుకోవడమే కాదు.. అడిగినా కేసు నమోదు చేసి, అరెస్ట్ చేస్తామని తెలిపారు. ఎవరైనా లంచం అడిగితే తమకు సమాచారం అందించాలని, బాధితుల పేర్లు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

చోరీ కేసులో నిందితులు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రవీందర్, ఎస్‌ఐ

గుండాల: మండల కేంద్రంలో వారం రోజుల కిందట ఓ నగల దుకాణంలో చోరీకి పాల్పడిన ముగ్గురు వ్యక్తులను గుండాల పోలీసులు అరెస్టు చేశారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడి కోసం గాలిస్తున్నారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ రవీందర్, ఎస్‌ఐ రాజమౌళి వివరాలు వెల్లడించారు. ఏపీలోని విజయవాడకు చెందిన మలపోలు శివనాగమహేశ్, బొమ్మిడి సాయికుమార్, కాకినాడ శ్రీనివాసచారితో పాటు మరో ప్రధాన నిందితుడు కలిసి ఈ చోరీకి పాల్పడినట్లు తెలిపారు. ఇల్లెందు, గుండాల పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నిఘా ఏర్పాటు చేసి మంగళవారం ముత్తాపురం ప్రాంతంలో ముగ్గురిని అరెస్టు చేశామని, ఆటోను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నాడని, అతని వద్దనే చోరీచేసిన నగలు ఉన్నాయని విచారణలో తేలిందన్నారు. త్వరలోనే ఆ నిందితుడిని కూడా పట్టుకుని కోర్టులో హాజరు పరుస్తామని వివరించారు. కేసును వారం రోజుల్లోనే ఛేదించిన ఎస్‌ఐ రాజమౌళి, సిబ్బందిని ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను, స్థానికులు అభినందించారు.

యువకుడి ఆత్మహత్య



అజ్మీర శివ (ఫైల్)

కొత్తగూడెంటౌన్: మనస్తాపంతో ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం చిట్టిరామవరంలో చోటుచేసుకుంది. చిట్టి రామవరం తండాకు చెందిన అజ్మీర శ్రీను, రాధ దంపతులకు కుమారులు. పెద్దకుమారుడు రామకృష్ణ సింగరేణిలో ప్రైవేట్ సెక్యూరిటీగా పనిచేస్తున్నారు. చిన్న కుమారుడైన అజ్మీర శివ (20) ఐటీఐ చదివాడు. ప్రైవేట్ ఫుడ్ డెలివరీ కంపెనీలో బాయ్‌గా పనిచేస్తున్నాడు. కొంత అప్పులు కావడంతో ఇంట్లో అడగగా తల్లిదండ్రులు లేవని, మందలించారు. మనస్తాపం చెందిన శివ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

ఉరి వేసుకొని వివాహిత...

అశ్వారావుపేటరూరల్: ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్‌ఐ యయాతి రాజు కథనం ప్రకారం.. మండలంలోని మొద్దులగూడేనికి చెందిన మొడియం లక్ష్మీ (28) భర్త వెంకటేశ్వరరావు కొద్ది రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. సోమవారం రాత్రి అతిగా మద్యం సేవించడంతో దంపతుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మనస్తాపానికి గురైన భార్య లక్ష్మీ కుటుంబీకులంతా నిద్రిస్తున్న సమయంలో ఇంటి ఎదుట ఉన్న చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తల్లి కొర్సా చుక్కమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలికి ఇద్దరు సంతానం.

పురుగులమందు తాగి వ్యక్తి..

బూర్గంపాడు: ఉప్పుసాక ఎస్టీ కాలనీకి చెందిన వ్యక్తి సోమవారం రాత్రి పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఉప్పుసాక ఎస్టీకాలనీకి చెందిన కుంజా శాంసన్ (33) సోమవారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రించిన తర్వాత పురుగులమందు తాగాడు. వాంతులు చేసుకుంటున్న అతడిని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రికి.. అక్కడి నుంచి కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. 15 ఏళ్ల కిందట ఎడ్లబండి పైనుంచి కిందపడిన శాంసన్ తలకు గాయమైంది. అప్పటి నుంచి అతను కొంత మతిస్థిమితం కోల్పోయి, ఏ పని చేయకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈ క్రమంలోనే సోమవారం రాత్రి పురుగుమందు తాగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య కుమారి, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి తండ్రి సుబ్బయ్య ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఏసుబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

బోనకల్: మండలంలోని మధిర-మోటమర్రి స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి(25) మృతదేహాన్ని పోలీసులు మంగళవారం గుర్తించారు. సదరు వ్యక్తి ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడడంతో మృతి చెందాడని భావిస్తున్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని ఖమ్మం జీఆర్పీ ఎస్‌ఐ భాస్కర్‌రావు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 87126 58589, 87126 58607 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

శివుడు కలలో కనిపించాడని తవ్వకాలు!



తవ్వకాల వద్ద గ్రామస్తులు

మణుగూరుటౌన్: పట్టణంలోని కమలాపురానికి చెందిన 15 ఏళ్ల బాలుడు తనకు కలలో శివుడు కనిపించి భూగర్భంలో ఉన్నానని చెప్పినట్లు వెల్లడించడంతో గ్రామస్తులు తవ్వకాలు చేపట్టిన ఘటన ఇది. సదరు బాలుడు మూడు నెలలుగా శివుడు స్వప్నంలో కనిపిస్తూ సమీపంలోని అటవీ భూమిలో ఉన్నందున వెలికితీసి పూజలు చేయాలని ఆదేశిస్తున్నాడని ప్రచారం చేశాడు. ఇన్నాళ్లు పట్టించుకోని గ్రామస్తులు చివరకు బాలుడు చూపిన చోట పూజలు చేసి సోమవారం నుంచి తవ్వకాలు చేపట్టారు. మంగళవారం వరకు నాలుగు అడుగుల మేర తవ్వగా, ఆ బాలుడు ఇంకో రెండు అడుగులు తవ్వితే బుధవారం శివలింగం బయటకు వస్తుందని చెప్పడం గమనార్హం.

రోడ్డుప్రమాదంపై కేసు నమోదు

చింతకాని: మండలంలోని పందిళ్లపల్లి పెట్రోల్ బంక్ వద్ద బొలెరో వాహనాన్ని కారు ఢీకొట్టిన ఘటనలో ఓ మహిళకు గాయాలయ్యాయి. ఏపీలోని వత్సవాయి మండలం పెంటేలవారిగూడెంకు చెందిన తూనం ఉపేందర్-అనూష దంపతులు కారులో గత శనివారం ఖమ్మం ఆస్పత్రికి వెళ్తున్నారు. బంక్ వద్ద వెనుక నుంచి బొలెరో వాహనాన్ని ఢీకొట్టడంతో అనూష తలకు గాయమైంది. ఉపేందర్ మంగళవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

వాహనం ఢీకొని యాచకుడి మృతి

అశ్వాపురం: మండల కేంద్రంలోని మణుగూరు – కొత్తగూడెం ప్రధాన రహదారిపై సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకుడు (60) మృతి చెందాడు. రహదారి వెంబడి యాచకుడు ఉండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడు. మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మార్చురీలో భద్రపరిచారు. అశ్వాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని ఎవరైనా గుర్తిస్తే సమాచారం అందించాలని ఎస్‌ఐ షేక్ సైదారవూఫ్ తెలిపారు.

రెండు నెలల వ్యవధిలో తండ్రీకొడుకులు...

అశ్వాపురం: మండలంలోని మల్లెలమడుగు గ్రామానికి చెందిన తావిటి మురళి (39) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం ఖమ్మంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. మృతుడి భార్య భారజల కర్మాగారం ఆస్పత్రిలో పనిచేస్తోంది. మురళి తండ్రి పొందయ్య రెండు నెలల కిందట వినాయకచవితి రోజు మృతి చెందగా మురళి నాగులచవితి రోజు మృతి చెందాడు. రెండు నెలల వ్యవధిలో తండ్రీకొడుకులు మృతి చెందటంతో కుటుంబంలో విషాదం నెలకొంది.

రోడ్డు ప్రమాదంలో మహిళ...

బూర్గంపాడు: మండలంలోని అంజనాపురం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందింది. పోలీసుల కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని కుక్కునూరు మండలం దామరచర్ల గ్రామానికి చెందిన వేల్పుల మహేందర్, అతని భార్య సంధ్య, కుమారుడు గౌరీమనోహర్‌తో కలిసి బైక్‌పై పాల్వంచ పెద్దమ్మగుడికి వస్తున్నారు. ఈ క్రమంలో అంజనాపురం గ్రామం వద్ద స్పీడ్ బ్రేకర్‌ను దాటుతున్న క్రమంలో బైక్ అదుపుతప్పి కిందపడిపోయింది. ఈ ఘటనలో బైక్ వెనుక కూర్చున్న సంధ్య (28) రోడ్డుపై పడటంతో తలకు తీవ్రగాయమైంది. గమనించిన స్థానికులు ఆమెను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బైక్ నడుపుతున్న మహేందర్, అతని కుమారుడికి కూడా గాయాలయ్యాయి. వారిని కూడా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. కాగా, మృతురాలి బంధువు అంగడాల కొండయ్య ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నాగభిక్షం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భద్రాచలం చెక్‌పోస్టు వద్ద భద్రత కట్టుదిట్టం





చెక్‌పోస్టులో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న సీఐ సంజీవరావు, వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

షిఫ్ట్‌ల వారీగా ఎస్‌ఐలకు విధుల కేటాయింపు

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలోని బ్రిడ్జి రోడ్డులో ఉన్న చెక్‌పోస్టు వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. నాలుగు రాష్ట్రాలకు కేంద్ర బిందువుగా ఉన్న భద్రాచలం మీదుగా రేషన్ బియ్యం, గంజాయి, పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు తనిఖీలు ముమ్మరం చేశారు. అశ్వాపురం, పాల్వంచ, మణుగూరు, భద్రాచలం ఎస్‌ఐల్లో ఇద్దరు చొప్పున రోజుకు రెండు షిఫ్ట్‌ల్లో విధులు నిర్వర్తించేలా ఎస్పీ రోహిత్‌రాజు ఆదేశాలు జారీ చేశారు. ఈ నిర్ణయం గత నెల 24 నుంచే అమలవుతుండగా, మంగళవారం నుంచి పూర్తిస్థాయిలో ఎస్‌ఐలు విధులు నిర్వర్తించారని అధికారులు తెలిపారు. కాగా, భద్రాచలం సీఐ సంజీవరావు చెక్‌పోస్ట్‌లో రిజిస్టర్లను పరిశీలించడంతో పాటు వాహన తనిఖీలపై సూచనలు చేశారు. కొత్తగూడెం ఎస్‌ఐ చల్లా అరుణ తదితరులు పాల్గొన్నారు.